నేటి దినపత్రిక

# సూర్య

18వ

www.suryaa.com

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

మంగళవారం,12 నవంబర్ 2024 | 8 పేజీలు


## క్యాన్సర్ బాధిత బాలికకు

# రూ.10 లక్షల సిఎం సహాయనిధి

### – మంజూరు పత్రం అందించిన మంత్రి డా.నిమ్మల రామానాయుడు



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:**క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలికకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10లక్షల మంజూరు పత్రంను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అందజేశారు. పాలకొల్లు కార్యాలయంలో పాలకొల్లు పట్టణ ఏడవ వార్డుకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికక్యాన్సర్ వ్యాధి బారిన పడగా ఆమె వైద్యం

- తరువాయి 2లో..

## రూ.1కోటి 2 లక్షలు సీఎంకి అందజేసిన

# ఎమ్మెల్యే అంజిబాబు

### – వరద బాధితులకు సహాయం చేసిన దాతలను అభినందించిన చంద్రబాబు

**భీమవరం,మేజర్‌న్యూస్:**విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు భీమవరం నియోజకవర్గం నుంచి సేకరించిన రూ. 1,02,00,000ల విరాళాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు భీమవరం నుంచి ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి రూ 1కోటి విరాళాలను అందించారని, వీటితోపాటు ఆహార పొట్లాలు, భోజనాలు,మరెన్నో సహాయ సహకారాలను అందించారని,చిన్నారులు సైతంవిరాళాలు సేకరించి అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే అంజిబాబు తెలియజేశారు. వరద బాధితులకు భీమవరం నియోజకవర్గం నుంచి దాతలందించిన సహకారం అద్వితీయమని,



ప్రతిఒక్కరికి ధన్యవాదములు తెలుపుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

## రసవత్తరంగా ఉమ్మడి పశ్చిమ జెడ్పి

# రాజకీయం!





### ప్రత్యేక సమావేశానికి 36 మంది వైసీపీ జడ్పీటీసిలు
### ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసిన సీఈవో
### అవిశ్వాసం పేరిట హడావుడి వెనుక రాజకీయమంటున్న చైర్పర్సన్

**ఏలూరు,సూర్యబ్యూరో :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్తు రాజకీయం రసవత్తరంగా మారింది. వైయస్సార్సీపి నుండి ఇటీవల తెలుగుదేశంలో చేరిన జడ్పీ చైర్పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్‌పై అవిశ్వాసం పెట్టి,ఆపదవి నుండి దించాలని మెజారిటీ వైసిపి జడ్పిటిసిలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసి జిల్లా కలెక్టర్‌ను, జడ్పీసీఈఓను కలిసి వినతి పత్రాలు సమర్పించారు.ఆమేరకు ఈనెల11వతేదీ సోమవారం ప్రత్యేక సమావేశంఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి 36 మంది వైయస్సార్సీపి జడ్పిటిసిలు హాజరయ్యారు. మరో నలుగురు

- తరువాయి 2లో..



# సోలార్ విరివిగా ఉపయోగించుకోవాలి

### - సౌరశక్తి వినియోగంపై అవగాహన కల్పించాలి
### - జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** సాంప్రదాయేతర ఇందన వనరులైన సౌరశక్తి వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం స్ధానిక అమీనాపేటలోని సాంఘీకసంక్షేమబాలికల వసతి గృహంలో ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను కలెక్టర్ కె. వెట్రిసెల్వి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూఫ్ టాప్ సోలార్ సిస్టం మంచి ప్రాజెక్ట్ అని, ఇక్కడ ఏర్పాటుచేసిన ప్లాంట్ బాగుందని, సంతృప్తి వ్యక్తం చేశారు.రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ఆదాతో పాటు అతితక్కువ ధరకే విద్యుత్ అందుతుందన్నారు.ఈసందర్బంగా ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి. సాల్మన్ రాజు మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ బాలికల వసతిగృహంలో 3 కె డబ్ల్యూ సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. హాస్టల్లో సోలార్ ప్లాంట్ అమరిక ముందు

- తరువాయి 2లో..

## అన్ని రంగాలలో

# 'నూజివీడు' అభివృద్ధికి కృషి





### – మంత్రి కొలుసు పార్ధసారథి
### – 20 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు
### – కొత్త రావిచర్ల ,పాత రావిచర్లలో శంఖుస్థాపనలు చేసిన మంత్రి

**నూజివీడు,మేజర్‌న్యూస్:** నూజివీడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథాన నిలిపేందుకు కృషిచేస్తానని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్ధసారధి చెప్పారు. ఏలూరు జిల్లాలోని నూజివీడు మండలంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంఖుస్థాపన చేశారు. నూజివీడు మండలం కొత్త రావిచర్ల రూ,20 లక్షలు,పాతరావిచర్ల గ్రామంలో రూ,15 లక్షలతో సుమారు రూ,35లక్షలతో సి,సి.రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్ధసారథి మాట్లాడుతూ ప్రజలు తమకు అందించిన అఖండ విజయాన్ని బాధ్యతగా స్వీకరించి పేద ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 20 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజి, త్రాగునీరు వంటి మౌలికసదుపాయాలుకల్పించేపనులను చేపడుతున్నామన్నారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచి అందించిన విజయాన్ని బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ప్రజలఆశలు,ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే 5ప్రధాన అంశాలపై చంద్రబాబునాయుడు సంతకాలు చేశారని, వాటిని పూర్తిస్థాయిలో నెరవేరుస్తున్నారన్నారు.

- తరువాయి 2లో..

# బకాయి జీతాల కోసం స్కూల్ శానిటేషన్ వర్కర్స్ ఆయాల ధర్నా




**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు నగర,ఏలూరు మండల ప్రభుత్వ పాఠశాలల స్కూల్ శానిటేషన్ వర్కర్స్ 200 మందికి (ఆయాలకు) రావలసిన నాలుగు నెలల బకాయి జీతాల కోసం నేడు స్కూల్ శానిటేషన్ వర్కర్స్ డి ఈ ఓ ఆఫీస్ వద్ద, కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ శానిటేషన్ వర్కర్స్ డి.ఈ. ఓ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి, నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలని, పస్తులతో పను లు చేయించడం సిగ్గుచేటని, అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలని,స్కూల్ శానిటేషన్ వర్కర్స్‌కి జీవో నెంబర్ 7 ప్రకారం 15,000 కనీస వేతనం ఇవ్వాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫారాలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని పెద్ద ఎత్తున నినదించారు.

అనంతరం డీఈఓ ఆఫీస్ వద్ద నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ ఏలూరు నగర గౌరవాధ్యక్షులు బి. సోమయ్య మాట్లాడుతూ స్కూల్ శానిటేషన్ వర్కర్స్ నాలుగు నెలలుగా జీతాలు లేక అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇచ్చే అరకొర వేతనం 6వేలు కూడా నెలనెలా ఇవ్వకపోవడం వల్ల స్కూలు ఆయాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. స్కూల్ ఆయాలకు రావాల్సిన 4 నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమానికి కృష్ణవేణి, దుర్గ, గౌస్య, పూజిత, రాజు,ఆంథోనీ, వెంకట లక్ష్మి, ఝాన్సీ రాణి, ఉషా రాణి, భవాని, సరస్వతి, కరుణ, జ్యోతి,పెద్దింట్లమ్మ, తిరుపతమ్మ, పద్మజ, లక్ష్మీ బాలాజీ, కే.లక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు, డీఈవోకు ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించారు.

## అధ్వాన్నంలో రోడ్డు... అవస్థలలో నివాసులు

– ప్రభుత్వాలు మారినా అభివృద్ధికి దూరం

– వాపోతున్న నారాయణలంక వాసులు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ రోడ్డు పరిస్థితి ఇంతే అన్నట్టు లంక వాసులు వాపోతున్నారు. కొత్తపేట, మండపేట నియోజకవర్గాలకు సరిహద్దు గ్రామం అయిన నారాయణలంక కు వెళ్లే రహదారి అభివృద్ధి ఎక్కడా జరగలేదు. ఎన్నో ఏళ్ల క్రితం ఆధునికీకరించిన ఈ రోడ్డు ఎక్కడికక్కడ గుంతలుగా మారడంతో వాహనదారులు ప్రయాణాల్లో చుక్కలు చూస్తున్నారు. ప్రధానంగా ఆర్అండ్‌బీ రోడ్లు శిథిలమవ్వడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. రహదారులు ధ్వంసమై గోతులమయం కావడంతో చదువుకునే విద్యార్థుల దగ్గర నుండి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రైతులు, కూలీలు, రోజు వాణిజ్యం సాగించే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రహదారులు ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్నప్పటికీ పాలకులు ఏమాత్రం పట్టించుకోవట్లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపడితే బాగుంటుందన్న భావన లంక నివాసులు వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన సదస్సు




**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న నేరాలు గురించి వాటి నుంచి చట్టరీత్యా వారికీ ఎలా రక్షణ లభిస్తుందో తెలియజేయడం కోసం ఈ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని రీజనల్ సిఐడి అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. సోమవారం స్థానిక కొవ్వూరు శ్రీ సుందర సాయి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ క్రైమ్ ఇన్విగేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం గురించి మరియు స్వతంత్రం తర్వాత ప్రభుత్వం సమాజంలోని అంటరానితనాన్ని నిర్మూలనపై అట్రాన్ సిటీ యాట్ గురించి చట్టపరిధిలో జరిగిన నేరాల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. బర్త్ సర్టిఫికెట్ అనగా పుట్టుక ద్వారా,వివాహము ద్వారా, మతము మారడం ద్వారా కులం అనేది మారదని తెలిపారు. మనిషిని మనిషిగా గౌరవిస్తే చట్టాల అవసరం ఉండవని అన్నారు.అంతేకాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 గురించి వివరించారు. అనంతరం ఆన్లైన్ ఎక్సమ్ పెట్టి అందులో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు మెమొంటోలను అడిషనల్ ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జయరాజు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, కె భీష్మ గంగేడు రిటైర్డ్ అదనపు జిల్లా న్యాయమూర్తి,ఎం సందీప్ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్, కే సాల్మన్ రాజు రిటైర్డ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎంపీడీవో సుశీల, కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, సిఐడి డీఎస్పి శ్రీనివాసరావు మరియు ఎస్సీ ఎస్టీ నాయకులు, విద్యార్థులు,ఇన్స్పెక్టర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల కోసం ప్రత్యేక రక్షక దళం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అభయ మహిళా రక్షక దళం జిల్లా వ్యాప్తంగా సోమవారం మహిళలు,చిన్నారుల రక్షణ,వారి భద్రతే మా ప్రధాన ధ్యేయంగా నేడు సమాజంలో మహిళలు, విద్యార్థినులు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్,ఇతర నేరాలు నుంచి రక్షణ కల్పించి వారికి సత్వర న్యాయం అందించేందుకు అభయ మహిళా రక్షక్ మహిళ పోలీసు సిబ్బందితో కలిసి ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్ మహిళలపై ,బాలికలపై జరిగే నేరాలు తగ్గించడానికి, మహిళల రక్షణ కొరకు మహిళా పోలీస్ సిబ్బంది కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషను,పబ్లిక్ ప్లేసెస్‌లో గస్తీ తిరుగుతూ 112 టోల్ ఫ్రీ నెంబరు ,వాట్స్ అప్ నెంబర్ 9550351100 ద్వారా ఏదైనా ఫిర్యాదు అందుకున్న వెంటనే 10 నిమిషాలలో అభయ మహిళా రక్షక దళం సంఘటనా స్థలానికి చేరుకొని అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని ప్రజలకు భరోసా కల్పించారు.డిఎస్పీ,అభయ మహిళా రక్షక దళ సభ్యులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ వద్ద 4 లక్షల రూపాయలు అపహరణ





**చింతలపూడి,మేజర్ న్యూస్ :** చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన చెక్క శ్రీనివాసరావు అనే వ్యాపారి 4 లక్షల రూపాయలు చింతలపూడి యూనియన్ బ్యాంక్ నుంచి విత్‌డ్రా చేసి బయటకు వచ్చి తన మోటార్ సైకిల్‌లో ఉంచగా అపహరించిన గుర్తు తెలియని దుండగులు. సంఘటన స్థలంలో విచారణ చేపట్టిన ఎస్సై కుటుంబరావు సీసీ కెమెరాలను పరిశీలించారు.

## క్యాన్సర్ బాధిత బాలికకు రూ.10 లక్షల సిఎం సహాయనిధి

మొదటిపేజి తరువాయి

నిమిత్తం సహాయం చేయవలసిందిగా ఆమె కుటుంబ సభ్యులు మంత్రిని కలిసి కోరారు. దీనిపై స్పందించిన మంత్రి రామానా యుడు బాలిక పరిస్థితిని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ 10 లక్షల మంజూరు చేశారు.ఈసందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ బాలికకు మెరుగైన వైద్యం అందేందుకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయం చేస్తానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.వైద్యం అందించే ఆసుపత్రి వైద్యులకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు.

## రసవత్తరంగా ఉమ్మడి పశ్చిమ జెడ్‌పి రాజకీయం!

మొదటిపేజి తరువాయి

అనారోగ్య కారణాల వల్ల హాజరు కాలేదని తెలిపారు.ఎటువంటి పరిస్థితుల్లోనూ వైఎస్ఆర్సిపి నుండిఎవరూ బయటకు వెళ్లారని, విప్ ధిక్కరించిన చైర్పర్సన్‌ను జడ్పీ పీఠం నుండి దించి వేయా లని ఆపార్టీ నాయకులు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సోమవారం జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. కోడ్ ముగిసిన అనంతరం మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని జడ్పీ సీఈఓ సుబ్బారావు సభ్యులకు తెలిపారు. కాగా ఈ తతంగం వెనుక ఒక ముఖ్యమైన వ్యక్తి ఉండి నడిపిస్తున్నారని, జడ్పిటిసి ఆలోచించి, తనకు సహకరించి, మరో రెండేళ్ల పాటు అందరూ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొందామని,తమపరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుందామని చైర్పర్సన్ గంట పద్మశ్రీప్రసాద్ విజ్ఞప్తి చేశారు.ఈవిధంగా జిల్లా పరిషత్ రాజకీయం రసకందాయంలో పడింది.

## సోలార్ విరివిగా ఉపయోగించుకోవాలి

మొదటిపేజి తరువాయి

నెలకు 950 యూనిట్లు వినియోగం ఉండగా,3కెడబ్ల్యూ సోలార్ ఏర్పాటు తదుపరి 432 యూనిట్లు వినియోగం జరుగుతుం దన్నారు. గతంలో నెలలో సుమారు 9 వేల వరకు విద్యుత్ చార్జీలు అవుతుండగా సోలార్ ప్లాంట్ పెట్టడం మూలంగా సుమారు నెలకు రూ.4500 మాత్రమే బిల్లు వస్తుందని, బిల్లు రావడం ద్వారా సుమారు 50 శాతం వినియోగం చార్జీలు తగ్గడం జరిగిందన్నారు.

కలెక్టర్ వెంట సాంఘీక సంక్షేమశాఖ జెడి వి. జయ ప్రకాష్, మున్సిపల్ కమీషనరు ఎ. భానుప్రతాప్, విద్యుత్ శాఖ డి.ఇ.కె ఎం.అంబేద్కర్, ఎడిఇ రాజ్ కుమార్, సోలార్ ప్లాంట్ వెండర్ సతీష్,ఎలక్ట్రికల్ ఎఇ ప్రసన్నవల్లి, తహాశీల్దారు జి.వి.శేషగిరి తదితరులు ఉన్నారు.

## అన్ని రంగాలలో 'నూజివీడు' అభివృద్ధికి కృషి

మొదటిపేజి తరువాయి

గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసినప్పటికీ ఇచ్చిన ప్రతీ హామీని తప్పనిసరిగా నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పార్థసారథి చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు వినియోగం ఆరోగ్యానికి మేలు

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** పూర్వీకులు ప్రకృతి అందించే జీవమృతం ఘన జీవమృతం కషాయాలు వినియోగించి పంటలు పండించి ఆహారంగా తీసుకొని ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందేవారని వారి పద్ధతిలో సేంద్రీయ కషాయాలతో పండించిన పంటలను వినియోగిస్తే ఆరోగ్యం గా జీవిస్తారని సేంద్రీయ వ్యవసాయ రైతు సాధికార సంస్థ మండల ట్రైనర్ కె శాంతకుమారి తెలిపారు. సోమవారం జీలుగుమిల్లిలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులు కూరగాయలను స్టాల్‌గా ఏర్పాటు చేసి విక్రయించారు. ఈ కూరగాయలు వినియోగించే వినియోగదారులు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల వలన కూరలలోరుచి అమోఘంగా ఉంటుందని ఆరోగ్యకరమైన ఆహారమని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ ప్రకృతిలో దొరికే ఆకులు ఇతర ఉత్పత్తుల ద్వారా కషాయాలు తయారుచేసి వాటిని పంటలకు వినియోగించడం ద్వారా కలుషితం లే నీ ఆహార ఉత్పత్తులను దిగుబడి చేస్తున్నట్లు వెల్లడించారు. తాము రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయం వైపు నడిచేలా రైతులను తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.



రానున్న రోజుల్లో కంపెనీలు తయారు చేసే మందులను వదిలి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు రానున్నట్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ శాఖ ఎల్ టు మట్టా నాగలక్ష్మి, డిజిటల్. లక్ష్మణ బాబు, సిఆర్పీలు నాగలక్ష్మి, స్పందన, రమేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# 14 నుండి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు : లైబ్రేరియన్ కుమారి



**నరసాపురం,మేజర్ న్యూస్ :** రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఉత్తర్వులు ప్రకారము నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజేఎస్ఎల్ కుమారి తెలిపారు. ఈనెల 14వ తేదీ వారోత్సవాలు ప్రారంభం బాలల దినోత్సవం చిత్రలేఖనం పోటీ,15వ తేదీ పుస్తక ప్రదర్శన డ్రగ్స్ పై అవగాహన సదస్సు,పత్రిక పఠనం పోటీలు,16వ తేదీ గ్రంథాలయ ప్రముఖులు కు నివాళి వ్యాసరచన పోటీలు, 17వ తేదీ కవి సమ్మేళనం కవితల పోటీ పాటల పోటీలు, 18 వ తేదీ చదరంగం పోటీలు మ్యూజికల్ చైర్స్ పోటీ,19వ తేదీ మహిళా దినోత్సవం క్విజ్ పోటీలు,20వ తేదీ ముగింపు సభనిర్వహిస్తామని ఆమె తెలిపారు. ముగింపు సభ సందర్భంగా బహుమతి ప్రధానం జరుగుతుంది.

కావున విద్యార్థిని విద్యార్థులు స్థానిక విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు,పుస్తక ప్రియులు,పట్టణ ప్రజలు ఈకార్యక్రమములో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పండ నాగేంద్రనాథ్, గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కే జేఎస్ ఎల్ కుమారిలు కోరారు.

# శ్రీ వాసవిలో వరుణ్ తేజ్ మట్కా సినిమా ప్రచార సందడి




**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** వరుణ్ తేజ్ , మీనాక్షి చౌదరి కథనాయక, నాయకిలుగా యువ దర్శకుడు కరుణ కుమార్ దర్శకత్వంలో వైరా ఎంటర్టైన్మెంట్స్,ఎంటర్టైన్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో రతన్ ఖత్రి అనే వ్యక్తి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న చిత్రం మట్కా సినిమా ప్రచారంలో భాగంగా చిత్ర యూనిట్ తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలకు సోమవారం సాయంత్రం విచ్చేసింది.

చలన చిత్ర హీరో వరుణ్ తేజ్, నటుడు సత్యం రాజేష్ తదితరులు విద్యార్థులతో మాట్లాడుతూ ఈ నెల 14వ తేది మట్కా సినిమా విడుదల అవుతుందని ఈ చిత్రం మీ అందరినీ ఆకట్టుకుంటుంది అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు హీరో వరుణ్ తేజ్ తో స్వీయ చిత్రాలకు పోటీపడ్డారు. వరుణ్ తేజ్ అందరినీ పలకరిస్తూ ఫోటోలు దిగారు.

# ఎస్ టీ సంఘం నేషనల్ ప్రెసిడెంట్‌గా రెండోసారి 'దేవరకొండ'

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఎస్‌టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ ఆలిండియా రెండవ సార్వత్రిక ఎన్నికలు ఆదివారం విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయని సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గా దేవరకొండ వెంకటేశ్వర్లు, చేపూరి పద్మజ, ఫైనాన్స్ సెక్రటరీ జనరల్‌గా రాచగిరి మధుసూదన రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మరకాల ప్రసన్న కుమారి, ఎరుకలి బాలకృష్ణ,ఫైనాన్స్ సెక్రటరీ జనరల్‌గా కందుల ఝాన్సీ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష – ప్రధాన కార్యదర్శులుగా గంటిమళ్ళ సత్తిబాబు, దేవరకొండ సాంబశివరావు, ఫైనాన్స్ సెక్రటరీ జనరల్‌గా సింగం బేబీరాణి ఎన్నికల ద్వారా నియమింపబడ్డారని వివరించారు.సంఘానికి బహుజన భావజాల సిద్ధాంతకర్తగా పాలపర్తి బాలాజీ మూడోసారి నామినేట్ చేయబడ్డారు. కేంద్రపాలిత ప్రాంతాలు, దేశంలోని వివిధ రాష్ట్ర కమిటీలు , జిల్లాలు, నియోజకవర్గాలు, మండల కమిటీలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఎన్నార్ై కమిటీ ఎంపిక కూడా జరిగింది. సంఘానికి జనరల్ అడ్వైజరీ బోర్డు, బహుజన రిసెర్చ్ వింగ్, అడ్వకేట్స్ అడ్వైజరీ బోర్డు, ఎక్స్టర్నల్ అఫైర్స్ అడ్వైజరీ బోర్డు,బిజినెస్ అండ్ కామర్స్ అడ్వైజరీ బోర్డులు నామినేట్ విధానంలో ఏర్పాటు చేసి వాటికి గౌరవ



సలహాదారులను నియమించడం జరిగింది.ఎన్నికల సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రముఖ జాతీయస్థాయి బహుజన నాయకులు రషీద్ ద్రవిడ, పెరియార్ అంబేద్కర్ పూలే హాజరయ్యారు.

ఈ ఎన్నికల సమావేశానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వందలాదిమంది ఆదివాసి అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఎన్నికల అధికారులుగా విశ్రాంత తహసిల్దార్ గుబ్బలనాగేశ్వరరావు , బహుజన నాయకులైనగుడే రాంబాబు , పాలపర్తి బాలాజీ, నెరుసు నాగమణి యాదవ్,పాము రవీంద్రనాథ్ వ్యవహరించారని సంఘానికి రెండవసారి జాతీయ అధ్యక్షులుగా ఎన్నిక కాబడిన వెంకటేశ్వర్లు తెలిపారు.

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి : ఆర్డీవో దాసి రాజు



నర్సాపురం, మేజర్‌న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కార పరిష్కార వేదిక ద్వారా వస్తున్న ఫిర్యాదులను తొందరగా పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీవో దాసి రాజు అధికారుల నాఆదేశించారు. సోమ వారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో సుమారు 32 ఫిర్యాదులను ఆర్డీవో రాజు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయం వరకు వేచి చూడకుండా వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నర్సాపురం రెవెన్యూ డివిజన్‌కి మంచి పేరు తీసుకుని రావాలన్నారు.

# పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు



నర్సాపురంరూరల్,మేజర్ న్యూస్: గ్రామ పంచాయతీలలో పనిచే స్తున్న కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, గ్రామ సమాఖ్య సభ్యులకుమంగళ, బుధవారాల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో జీఎవీఎస్ రామకృష్ణంరాజు తెలిపారు. 2025 –26 సంవత్సరానికి ప్రణాళిక రూపొందించేందుకు శిక్షణా తరగతుల ద్వారా నిర్ణయం తీసుకోవడం ఆయన తెలిపారు. ఉదయం 9గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని, సంబంధిత సిబ్బంది తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

# హెల్మెట్ పై అవగాహన ర్యాలీ నిర్వహించిన శ్రీ చైతన్య విద్యార్థులు




**తణుకు,మేజర్ న్యూస్:** తణుకు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సురేఖ జెండా ఊపి ప్రారంభించారు.

శ్రీ చైతన్య యాజమాన్యం ప్రతి నెల థీమ్ ఆఫ్ ది మంతగా నిర్వహించే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా సేఫ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించు కోవాలని, హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరి అని విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో హెల్మెట్ లేని పలువురు ద్విచక్ర వాహనదారులకు పుష్పాలు ఇచ్చి హెల్మెట్ లేకపోతే కుటుంబం అంతా నష్టపోతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆకుల సురేఖ తెలియజేశారు.

విద్యార్థిని విద్యార్థులకు భారతదేశాన్ని సంరక్షించుకోవలసిన పద్ధతులను వివరించారు.ఏజిఎం పార్థసారథి, రీజనల్ కోఆర్డినేటర్ రామారావు విద్యార్థులకు భవిష్యత్తులో భారతదేశం ఉన్నత స్థితిలో ఉండే విధంగా విద్యార్థుల మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్‌పి శ్రీనివాసరావు, ఏవో బిరామాంజనేయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మౌలానా ఆజాద్ స్ఫూర్తిని పొందాలి



**భీమవరం,మేజర్‌న్యూస్:** విద్య వల్ల ఉజ్వల భవిష్యత్తు సాధ్యం అని ఆనాడే గుర్తించిన మహనీయుడు మౌలానా ఆజాద్ నుండి స్ఫూర్తిని పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.సోమవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్ నందు మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మైనార్టీ సంక్షేమం, జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భారతరత్న దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఎంతో ఆదర్శనీయమైనదని, వారి కలలను సాకారం చేయుటకు కృషి చేయాలన్నారు. ముస్లిం మైనారిటీ సమాజంలోని పిల్లలందరూ మౌలానా ఆజాద్ కలలను సహకారం చేయుటకు కృషి చేయాలని ముఖ్యంగా విద్య వల్లనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని కలెక్టర్ తెలిపారు.

జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ మౌలానాఆజాద్ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొని వచ్చి ఉపాధ్యాయులు, విద్యార్థులకు స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా ఉంటూ జ్ఞాన ప్రసారాన్ని వ్యక్తిత్వ నిర్మాణం కోసం కృషి చేశారన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తున్నదని ముస్లిం మైనార్టీ సమాజం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్చార్జి జిల్లా మైనార్టీ అధికారి హెచ్.వి.ఎస్ మూర్తి, డిఇఓ కార్యాలయం సహాయ సంచాలకు ఎన్.సత్యనారాయణ, ముస్లిం పెద్దలు మహబూబ్ అలీ ఖాన్,ఎం.డి రియాజుద్దీన్, చెన్నరంగనిపాలెం ఎంపిఎల్ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలు

## – నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్, జెసి

**ఏలూరు,మేజర్‌న్యూస్:** భారత స్వాతంత్ర్య సమర యోధుడు,భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఓ వి.విశ్వేశ్వర రావు,జిల్లా మైనారిటీ సంక్షేమశాఖఅధికారి ఎన్.ఎస్. కృపవరం, డిఈవో వెంకటలక్ష్మీ, డిఆర్‌డిఏ పిడి ఆర్. విజయరాజు, ఏలూరు ఆర్డిఓఅచ్యుతఅంబరీష్,స్పెషల్ డిప్యూటీకలెక్టర్ కె. భాస్కర్,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పుష్పాలు వేసి నివాళులు అర్పించారు. ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. వారిని సమాజంలో విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత మనఅందరిపై ఉందని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా కల్పించాలి





## – ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలి

**గుడివాడ/ ఏలూరు,మేజర్ న్యూస్:** పార్లమెంట్లో బిల్లు పెట్టే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధాని నరేంద్ర మోడీపై ఒత్తిడి తెచ్చి, అఖిలపక్షం ఏర్పాటు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదాకల్పించాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరి కె.వరప్రసాదరావు డిమాండ్ చేశారు.గుడివాడలో సోమవారం ఆంధ్ర ప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ శ్యాంబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమంలో రిటైర్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ జస్టిస్ బాలకృష్ణ కమిటీ ఆంధ్రప్రదేశ్ కి వస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరు దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా కల్పించాలని, మత స్వేచ్ఛ హక్కుల రక్షణ కల్పించాలని సంతకాల సేకరణ చేయాలని కోరారు. దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు మాట్లాడుతూ గతంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందని, తక్షణమే ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. బిగ్ దయాస్ బిషప్ రెవరెండ్ శాంతి సాగర్ మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్యంలో అతిపెద్ద భారతదేశంలో దళిత క్రైస్తవులకు షెడ్యూల్ కులాల వారికి రాయితీలు లేక, రిజర్వేషన్స్ లేక పేదలు నిరుపేదలుగా మారుతున్నారని, రాజకీయంగా,ఆర్థికంగా సామాజికంగా ఈ వర్గాల వారికి అవకాశాలు కల్పించాలనికోరారు. సెక్యులర్ భారత్ దేశంలో అన్ని కులాల వారికి మత స్వేచ్ఛ ఉందని దళిత క్రైస్తవులకు మత స్వేచ్ఛ హక్కుల రక్షణ లేకుండా పోయిందని విక్టోరియా బాప్టిస్ట్ మిషన్ అధ్యక్షులు రెవరెండ్ పండు మద్దాలఅన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ పాస్టర్ సబ్బా బర్న్ బాస్ మంచి వర్తమానాన్ని అందించారు. అప్పికట్ల జాషువా అనేక మంది దైవజనులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారని జరిగిందని రెవరెండ్ పాస్టర్ శ్యాం బాబు తెలిపారు.

# వై యన్ కళాశాలలో సంతాన ఉత్పత్తిపై వర్క్ షాప్



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ వై ఎన్ కళాశాల బయో టెక్నాలజీ, ఫిజిక్స్ విభాగాల ఆధ్వర్యంలో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ టెక్నాలజీ –క్లినికల్ అంతర్దృష్టులు విజయాన్ని సాధించడంలో పిండ శాస్త్రవేత్తల పాత్ర' అనే అంశంపై ఒకరోజు వర్క్ షాప్‌ను నిర్వహించారు. సోమవారం జరిగినఈ వర్క్ షాప్‌కి రిసోర్స్ పర్సన్ గా విశాఖ పట్టణానికి చెందిన క్లినికల్ ఎంబ్రియోలాజిస్ట్ డాక్టర్ మురళీ కృష్ణ హాజరై మాట్లాడుతూ ఇటీవల కాలంలో మన చుట్టూ ఉన్న సమాజంలో పిల్లలు పుట్టక పోవడమనే విషయం మనం వింటున్నాం. దీనికి ప్రధాన కారణాలు మన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, ఆలస్య పెళ్ళిళ్ళు వంటి మరెన్నో విధానాలు ఉన్నాయని, అందుకే ఇటీవల కాలంలో ఈ ఐ.వై. ఎఫ్ అనే ప్రక్రియ వచ్చిందని, ఐవి ఎఫ్ అనగా ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ అని, ఇది అత్యంత ప్రభావవంతమైన సంతానోత్పత్తి చికిత్స, ఇందులో గుడ్లు లేదా పిండాలు స్పెర్మ్‌ల నిర్వహణ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనక రావు, వైస్ ప్రిన్సిపాల్ బెజవాడ వెంకట రత్నం, డీన్ డాక్టర్ గంధం శ్రీ రామకృష్ణ,బయో టెక్నాలజీ హెడ్ శ్యాంబాబు, ఫిజిక్స్ హెడ్ అప్పన ఫణి, మల్లేశ్వర రావు, పరిమి రామ కృష్ణ, షారన్ పుష్ప, రాణి, వజ్ర సునీల, రంగనాయకులు, నవీన్, శంకర్, సంధ్య, లక్ష్మి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# హిందువులు,ముస్లింల ఐక్యతకు కృషి చేసిన ఆజాద్



**పాలకొల్లు, మేజర న్యూస్:** జి వి ఎస్ వి ఆర్ ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల యందు రసూల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వతంత్ర భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా రసూల్ సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ ఈయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారని, మనం హిందువులమైన, ముస్లింల మైనా ముందుగా భారతీయులం. ముందు దేశం,తర్వాత మతం అనే స్వతంత్ర పోరాటంలో హిందూ ముస్లింల ఐక్యత కృషి చేసిన వ్యక్తి అని,మౌలానా అంటే పండితుడని, ఆజాద్ అనునది ఈయన కలం పేరుని. స్వతంత్ర సంగ్రామం పోరాటానికి వ్యాసాలురా శారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ మస్తాన్ వలీ ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీప్రసాద్ రాయపూడి పాల్గొనరి అనంతరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది.

# వయోజన విద్య పై శిక్షణ



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో 2030 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధించేలా కృషి చేయాలని ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం వెలుగు సెర్ప్ కార్యాలయంలో మహిళలకు ఉల్లాస్ అక్షరాస్యత వయోజన విద్య పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో. కె.వెంకటలక్ష్మి, వెలుగు ఏపిఎం ఝాన్సీ మాట్లాడుతూ వయోజన విద్య వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. మహిళలు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తామని అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్స్ అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

# కొత్తపల్లికి ఘన స్వాగతం - పట్టణంలో భారీ ర్యాలీ





**నర్సాపురం,మేజర్ న్యూస్** : కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులై మొదటిసారి నర్సాపురం విచ్చేసిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. సోమవారం మధ్యాహ్నం నర్సాపురం – పాలకొల్లు రోడ్డు నుండి చిట్టవరం సమీపానికి చేరుకోగానే అభిమానులు జాతీయ రహదారిపై వుండి స్వాగతం పలికారు. అనంతరం స్థానిక నీటిపారుదల శాఖ అతిథి గృహం సమీపానికి చేరుకున్నారు. అక్కడ వేల సంఖ్యలో అభిమానులు హాజరై పూలదండలు, శాలువాలతో ముంచెత్తారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ కు చేరుకోగానే వివిధ పార్టీల నాయకులు, నరసాపురం నియోజకవర్గం, ఇతర నియోజకవర్గాలు, తూర్పుగోదావరి జిల్లా నుండి హాజరైన అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

అంబేద్కర్ సెంటర్లో క్రేన్ ద్వారా భారీ గజమాలను కొత్తపల్లి కి వేశారు. సుబ్బారాయుడు జిందాబాద్, కొత్తపల్లి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ అభిమానుడు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఊరేగింపుగా నివాసానికి చేరుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, బొమ్మిడి సునీల్, య ర్రం శెట్టి బాబులు, దొండపాటి స్వాములు, వివిధ పార్టీలకు చెందిననాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రూ. 15.98 కోట్ల విలువైన 7,101 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**- జిల్లా జెసి ధాత్రి రెడ్డి వెల్లడి**

**భీమడోలు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లాలో 2024–25 ఖరీఫ్ పంట కాలమునకు సంబంధించిఇంతవరకు రూ.15.98 కోట్లవిలువైన 7,101 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. సోమవారం పూళ్ళ ఎల్ ఎస్‌సిఎస్ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రములను జాయింట్ కలెక్టరు పరిశీలించారు. పూళ్ళలోని శ్రీ కస్తూరీ రైస్ మిల్లు, శ్రీ వెంకట సుబ్బరాజు రా అండ్ బాయిల్డు రైస్ మిల్లులలో ధాన్యమును దిగుమతికి సంబంధించి ఆలస్యము జరుగుట గ్రహించి రైస్ మిల్లర్లకు ధాన్యము రైస్ మిల్లుకు రాబడిన వెంటనే నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతుకు ఇబ్బంది కలుగకుండా సకాలములో ధాన్యము సేకరణ పోర్టల్‌లో ట్రక్ చిట్ ద్వారా ధాన్యము రైస్ మిల్లుకు చేరినట్లుగాను,సదరు ధాన్యము దించుకున్నట్లుగా ధృవీకరించవలసిదిగా ఆదేశించియున్నారు. సొంత వాహనము కల రైతులు వారు వారికి సంబంధించి వాహన వివరములతో సంభందిత రైతు సేవా కేంద్రమును సంప్రదించినచో వారు ధాన్యము తరలించుటకు వాహనమును అన్ లైన్ నందు ముందుగా రిజిష్ట్రేషన్ చేయుటకు అవసరమైన అన్ని చర్యలు జిల్లా యంత్రాగం చేపట్టిందన్నారు. కావున స్వంత వాహనము కల రైతు స్వచ్ఛందంగా ముందుకు రావలసిదిగా కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై పూర్తి పర్యవేక్షణకు అవసరమైన చోట్ల క్షేత్ర స్థాయిలో మండలల వారిగా ప్రత్యేక అధికారులను నియమించమన్నారు. అంతేకాకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై ఫోన్ ద్వారా రైతుల సందేహాలపై తగిన సలహాలు, సమాచారం పొందుటకు, వారి ఫిర్యాదు చేయుటకు , వాటి పరిష్కరం కొరకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, టోల్ ఫ్రీ 18004256453) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



# ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నిర్వహించాలి

**- భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలి : ఏఐటీయూసీ**




**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నిర్వహించాలని, భవన నిర్మాణసంక్షేమబోర్డును పునః ప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్, కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాపిత పిలుపుమేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న 42 వేల క్లయములకు నిధులు మంజూరు చేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఇసుకపై విధించిన జి.ఎస్.టి.తో పాటు ఇతర పనులు రద్దు చేయాలని కోరారు.

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని ప్రకటనలు చేస్తున్నారని, ఆచరణలో ఎక్కడ అమలు పరిచిన దాఖలాలు లేవని విమర్శించారు. ఉచిత ఇసుక పాలసీ ప్రకటనలకే పరిమితమైందని రుజువైందన్నారు.ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పెళ్ళికానుక, కార్మికులకు గాయపడితే ఇచ్చే నష్టపరిహారం ఇతర క్లెయిములు పరిష్కరించకుండా కాలయాపన చేశారని విమర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, భవన నిర్మాణకార్మికులు జూపూడి వసంత,ఎస్.కె. సుభాని,బోడే వెంకట్రావు, వాకా రామ్మోహన్‌రావు, తోట వెంకటరావు, పగడ ప్రసాద్, కేశివ,కురెళ్ళ వరప్రసాద్,తెర్లాపు శ్రీను, పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మతో బిజెపి జిల్లా కార్యదర్శి చాట్రాతి భేటీ



**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్:** కేంద్రమంత్రి శ్రీనివాస వర్మను భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన క్షత్రియ వన సమారాధనకు శ్రీనివాస్ వర్మ విచ్చేశారు. ఈ సందర్భంగా చాట్రాతి ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సమస్యలను, స్థానిక సమస్యలపైన అభివృద్ధిపై కేంద్ర మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ సానుకూలంగా స్పందించారని చాట్రాతి ప్రసాద్ తెలిపారు. ఈయన వెంట బిజెపి నాయకులు పైడిమర్ల కోటిరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన పీజీటీ పోసియ్య



పెంటపాడు, మేజర్‌న్యూస్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో నవంబర్ 9న విజయవాడ లోని ఐజిఎంసి స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 2024–25 సం రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టు కు నల్లి పోసియ్య ఎంపికయ్యారు. పెంటపాడు గవర్నమెంట్ పోస్ట్ బేసిక్ పాఠశా లలో పిజిటి, వృక్షశాస్త్రం ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తు న్నారు. త్వరలో పూణే(మహారాష్ట్ర)లో జాతీయ స్థాయిలో జరగబోయే వాలీబాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పోసియ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, టీవీ.రామకృష్ణ, ఎస్ఎంసి ఛైర్మన్ కళింగ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు ఎన్. రాజేష్‌లు పిజిటి పోసియ్య ను ఇదే స్ఫూర్తితో క్రీడారంగంలో రాణిస్తూ, దేశం తరఫున జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని అభినందించారు. ఇటువంటి ఉపాధ్యాయులు మన పాఠశాలలో ఉండడం,మన పాఠశాలకు మరియు గ్రామానికి గర్వకారణం అని అన్నారు.

## డొక్కా సీతమ్మ కొత్త మెనూ అమలు చేయాలి



**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు నాణ్యమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తుందని ఈ పథకానికి తగ్గట్టుగానే ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులంతా రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిని వారికి సకాలంలో వేతనాలు అందించి ఆదుకోవాలని కోరారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజన పథకం కొత్త మెనూ అమలు చేయాలని అన్నారు. వర్కర్లకు 12 నెలల వేతనాలు చెల్లించాలని సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు.

అనంతరం మండల విద్యాశాఖ అధికారి తెల్లం బాబూరావుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అనురాధ, దుర్గా, శాంత కుమారి, మరియమ్మ, సత్యవతి, సోమలమ్మ, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

# బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల నిరోధం పై అవగాహన

**ఏలూరు,మేజర్ న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం ఏలూరు లోని సిహెచ్.యస్.డి.సెయింట్ థెరిసా జూనియర్ కళాశాల నందు విద్యార్థునులకు బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల నిరోధ అంశం పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే శారీరకంగా మానసికంగా దృఢత్వం వస్తుందని,కావున 18 సంవత్సరములు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లు సమాచారం ఉన్న సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. అలాగే ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాల విక్రయం విరివిగా పెరిగిందని విద్యార్థుల లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలల ప్రాంతాల్లోని సంఘ విద్రోహ శక్తులు వివిధ రూపాలలో విద్యార్థులకు అలవాటు చేస్తున్నారని, కనుక విద్యార్థులు అపరిచిత వ్యక్తుల



తో జాగ్రత్తగా ఉండాలనితెలిపారు. సమావేశంలో ట్రైనీ జునియర్ సివిల్ జడ్జీలు వి. రఘునాథ్, టి.ఏ.ఎస్.ఎస్.ఆర్. ఆదిత్య రిషిక్, ఏ.వి నాగరాజు , కె.స్పందన, జె.బి.టి.ఎస్. దేవి , కుమారి డి.అరుంధతి సోషల్ వర్కర్ ఎం అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వశిష్ట రేవు 6,7,8, వార్డులలో పారిశుధ్య పనులు పరిశీలన



**నరసాపురం, మేజర్ న్యూస్ :** మున్సిపల్ కమీషనర్ యం అంజయ్య సోమవారం వశిష్ట రేవులోని 6,7,8 వార్డుల లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ పారిశు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పట్టణ పరిధిలో ఉన్న ప్రతి వార్డులో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పారిశుధ్యం లోపిస్తే అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు . దోమలు నిర్మూలన కోసం తగు చర్యలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో సానిటరి ఇంస్పెక్టర్ వేంద్ర ప్రసాద్,సానిటరి మేస్త్రి కిషోర్, నరేష్ సచివాలయ సిబంది పాల్గొన్నారు.

# మానవత సంస్థ వితరణతో కృత్రిమ కాలు అందచేత



**అగిరిపల్లి,మేజర్ న్యూస్:** మండలం పరిధి తోటపల్లి గ్రామంలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో సోమవారం మానవతా స్వచ్ఛంద సంస్థ వితరణతో గన్నవరంకు చెందిన మల్లంపల్లి జయమ్మకు కృత్రిమ కాలును సి.ఆర్.రెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి డా.మాగంటి ప్రసాద్ చేతులమీదుగా అందచేశారు. ఈ సందర్భముగా జరిగిన కార్యక్రమం లో మానవతా సంస్థ రాష్ట్ర బాధ్యులు ఆలపాటి నాగేశ్వర రావు మాట్లాడుతూ పేద విద్యార్థులతో పాటు, అంధులకు, దివ్యాంగులకు హీల్ సంస్థ చేయుచున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమములో న-ఉయనా బౌద్ధారామం -చెక్కపల్లి డైరెక్టర్ సత్యనారాయణ రాజు, హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కోనేరు సత్య ప్రసాద్, సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 13న నీటిపారుదల సలహా మండలి సమావేశం

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం ఈనెల 13వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో నిర్వహించడం జరుగుతుందని ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ సిహెచ్. దేవప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గోదావరి పశ్చిమ డెల్టాకు రబీ సీజన్‌కు సంబంధించి నీటి లభ్యత ఆయకట్టు గురించి, 2024-25 రబీ పంట అనంతరం కాలువలు మూసివేయు తేదీ నిర్ణయం,జిల్లాలోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి పంట విస్తీర్ణం,నీటి విడుదల తేదీ నిర్ణయం, తదితర అంశాలు చర్చించడం జరుగుందన్నారు.

## 24న జరిగే కోత పండుగకు క్రైస్తవులు హాజరు కావాలి

**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** ఈనెల 24వ తేదీన జరిగే కోత పండుగకు క్రైస్తవులు హాజరుకావాలని సెయింట్ మార్క్స్ లూథరన్ దేవాలయం ప్యారిస్ పాస్టర్ ఆమెన్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా కోత పండుగ నిర్వహించడం జరుగుతుందని అలాగే ఈ ఏడాది కూడా కోత పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పండుగకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఆయన కోరారు.

## 13న కె.ఆర్.పురం ఐటిడిఎను సందర్శించనున్న జెసి ధాత్రిరెడ్డి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా జాయింట్ కలెక్టరు, ఐ.టి.డి.ఎ. ప్రాజెక్ట్ అధికారి (పూ.అ.భా.) పి. ధాత్రిరెడ్డి, ఈనెల 13వ తేదీ బుధవారం కె.ఆర్.పురం ఐ.టి.డి.ఎ కార్యాలయం నందు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తదుపరి క్షేత్ర స్థాయిలో సందర్శిస్తారు. అనంతరం కె.ఆర్.పురం ఐ.టి.డి.ఎ నందు ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరిస్తారు.

# చిన్న వెంకన్న హుండీ లెక్కింపు



**ద్వారకా తిరుమల,మేజర్ న్యూస్:** శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి హుండీల ద్వారా మంగళవారం 2.04కోట్ల రూపాయల భారీ ఆదాయం సమకూరింది. స్థానిక ప్రమోద కళ్యాణ మండప ఆవరణలో సోమవారం ఉదయం ఆలయ డివిఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు నడుమ దేవాలయ సిబ్బంది హుండీల లెక్కింపు నిర్వహించారు. గడచిన 21 రోజులకు గాను జరిగిన ఈ హుండీ లెక్కింపులో శ్రీ వారికి నగదు రూపేణ రూ2,04,67,691లు ఆదాయం లభించినట్లు తెలిపారు.అలాగే భక్తులు సమర్పించిన కానుకల రూపేనా 234 గ్రాముల బంగారం,4-998 కేజీల వెండి లభించినట్లు ఈఓ పేర్కొన్నారు. అలాగే విదేశీ కరెన్సీ సైతం హుండీలో ద్వారా అధికంగానే లభించినట్లు తెలిపారు.

# లక్ష్మణేశ్వరంలో అన్న సమారాధన



**నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** మండలంలోని లక్ష్మణే శ్వరంలో గల శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి వారి దేవస్థానంలో రెండవ సోమవారం కార్తీక మాసం సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. పితాని మేరక గ్రామస్తుల దన సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంత గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో చాగంటి సురేష్ నాయుడు ఏర్పాట్లు చేశారు. ఆలయ సిబ్బంది ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు




**నర్సాపురం, మేజర్‌న్యూస్ :** విఓఏల మూడేళ్ళ కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ వెలుగు వివోల సంఘం ఆధ్వర్యంలో వివోలు ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సత్య నారాయణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విఓఎలను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మహిళా మార్టులలో బలవంతపు సరుకుల కొనుగోలు ఆపాలన్నారు.భద్రత కల్పించాలి. 4 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు.గత ప్రభుత్వం 3సంవత్సరాలు విఓఏగా పని చేసినటువంటి వారిని తొలగించి వారిస్థానంలో కొత్తవారిని తీసుకోవాలని 2019 నవంబర్‌లోసర్క్యులర్‌జారీ చేశారన్నారు.కూటమి ప్రభుత్వం కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. సర్క్యులర్ని రద్దు చేసి విఓఎల ఉపాధిని కాపాడాలని, అక్రమ తొలగింపులను ఆపాలన్నారు .అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో కె.దుర్గ, జి.స్వాతి, ఎం.స్వర్ణలత, ఎం.బాలత్రిపురసుందరి,జె.గీత,ఎస్.వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు : 7 మద్యం సీసాల స్వాధీనం



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడులలో ఆచంట మండలం పుచ్చల్లంక గ్రామానికి చెందిన యడ్ల శ్రీనివాస రావు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుండి 7 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడులలో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలియ చేశారు.

# నిర్ణీత కాలవ్యవధిలో అర్జీలకు పరిష్కారం చూపాలి

## – పిజిఆర్ఎస్‌లో 236 అర్జీలు స్వీకరణ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన ఫిర్యాదుల పరిష్కారాన్ని నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 236 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు, భాస్కరరావు, మున్సిపల్ కమీషనరు ఎ.భానుప్రతాప్‌లతో కలిసి ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై వేదికనుంచే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కె.వెట్రిసెల్వి డివిజన్, మండలస్థాయి అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు.

– అందిన అర్జీల్లో కొన్ని –నిడమర్రు మండలం పెదనింద్రకొలను చెందిన పెద్దిరాజు తమ గ్రామంలో కూలరాజు చెరువు ప్రభుత్వ అనుమతి లేకుండా చేపలు, రొయ్యిలు పెంపకంగా మార్చినారు. దీనిద్వారా గ్రామాల్లో కాలుష్యం పెరుగుతుంది. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు. పోలవరానికి చెందిన షేక్ అహ్మద్ భాషా తమకు ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. కలిదిండికి చెందిన వెంకటశివరామ్ తమ గ్రామంలో 100 మంది రైతులకు సంబంధించిన భూమిని 22ఎ రికార్డునుండి తొలగించాలని కోరుతూ అర్జీ అందజేశారు. కైకలూరు మండలం కోరుమిల్లు గ్రామానికి చెందిన అప్పారావు తన సొంతభూమిని సర్వేచేయించి హద్దులను గుర్తించాలని కోరుతూ అర్జీ అందజేశారు. కలిదిండి మండలం తాళ్లపాలెంకు చెందిన దివ్యాంగుడైన తనకు ప్రభుత్వం కల్పిస్తున్న పెన్షన్‌ను ఇప్పించవలసిందిగా అర్జీ అందజేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సెక్షన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మరణానంతరం రైతు బిడ్డ నేత్రదానం





**భీమడోలు,మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన ప్రముఖ రైతు బిడ్డ మొగళ్ళ పాండు రంగ విఠల్ కొండల రాయుడు (64) మరణానంతరం నేత్రదానం చేశారు. హైదరాబాద్ కు చెందిన అమ్మా నేత్ర, అవయువ, శరీర దానం ప్రోత్సాహికు సంఘం ఏలూరు జిల్లా కో ఆర్డినేటర్ టి.సుమన్ బాబు ప్రోత్సాహంతో మొగళ్ళ పాండు కుటుంబ సభ్యులు అంగీకారంతో సోమవారం నేత్ర దానం చేశారు. ప్రముఖ కంటి శస్త్రచికిత్స వైద్య సంస్థ అయిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్టిస్టూట్ సిబ్బంది స్థానిక నిడదవోలు రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ సిబ్బంది ఈమేరకు రెటీనా సేకరించారు.

ఈసందర్భంగా జిల్లా కో–ఆర్డినేటర్ సుమన్ బాబు మాట్లాడుతూ పాండు రంగ విఠల్ ఆశయం ఎందరికో స్ఫూర్తి దాయకం అని సహరించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మరణానంతరం మనిషిని కాలిస్తే బూడిద అవుతుందని పాతిపెడితే మట్టిలో కలిపోతారని సమాజం పట్ల బాధ్యత కలిగిన ప్రతీఒక్కరూ నేత్రదానం, అవయువ దానం, శరీర దానం చేయటానికి ముందుకు రావాలని సుమన్ బాబు కోరారు. పాండు రంగ విఠల్ నేత్ర దానం చేయటం పట్ల పలువురు అభినందించారు.

# క్షీరా రామాన్ని దర్శించిన లేడీ అఘోర



పాలకొల్లు,మేజర్ న్యూస్: పంచారామ క్షేత్రాలలో ఒకటైన శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామిని సోమవారం దర్శించు కొన్న నాగసాధు లేడీ అఘోరి. స్వామిని దర్శించుకుని తనదైన శైలిలో పూజలు నిర్వహించారు. అఘోరి ని చూసేందుకు భక్తులు బారులు తీరారు. అఘోరి కారు వెనక పరుగు పెట్టారు.

పోలీసులు ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో దర్శనం జరిగింది. కేవలం నిమిషాల వ్యవధిలో అగోరి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి వెళ్లిపోవడం విశేషం అనంతరం శ్రీకాకుళం వెళుతున్నానని ఆఘోరి మీడియాతో చెప్పారు.

# వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపు రైతు మెడకు ఉరి వేయడమే



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ నామమాత్రపు కేటాయింపులతో అన్నదాతలకు ఒరిగేదేమీ లేదని, పైగా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపుకు నిధులు కేటాయించి రైతు మెడకు ఉరితాడు బిగించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం స్థానిక అన్నే భవనంలో రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ పై ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్ రూ. 2.94 లక్ష కోట్లు గాక ఇందులో రూ.43వేలకోట్లతో రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ రూపొందించారని, రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారని, నామమాత్రపు కేటాయింపుల వలన అన్నదాతలకు ఒరిగేదేమీ లేదన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపు ప్రక్రియను గత ప్రభుత్వం జీవో 22 ద్వారా అమలు చేసినప్పుడు వ్యతిరేకించిన తెలుగుదేశం, జనసేన ఇప్పుడు వీరే మీటర్ల బిగింపుకు నిధులు కేటాయించడం అత్యంత దారుణమన్నారు. మోటార్లకు మీటర్లు బిగిస్తే పీకేయండి అని రైతులకు పిలుపునిచ్చిన వారే మీటర్ల బిగింపుకు నిధులు కేటాయించడం ఇదేనా రైతులకు ఇచ్చిన వాగ్దానం అని ప్రశ్నించారు.

జీవో 22 రద్దు చేయకుండా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించి ప్రజా తీర్పును విస్మరిస్తే రైతులు సహించబోరని హెచ్చరించారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం నిధులు కేటాయించడం హర్షణీయ మని అయితే వెంటనే రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఇప్పటివరకు రైతులకు అవసరమైన టార్పాలిన్లు కూడా అందించలేకపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు ఆట వస్తువులు, బిస్కెట్లు పంపిణీ చేసిన ట్రేస్ సంస్థ





**ఏలూరు రూరల్,మేజర్ న్యూస్:** వైయస్సార్ నగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలను సోమవారం జర్మనీ దేశము నుండి మైఖేల్ అనే ప్రముఖ సోషల్ వర్కర్ ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ దిడ్ల యాంజిలో ఆహ్వానంపై సందర్శించారు. విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులు అందజేశారు. విద్యార్థులు ఆట స్థలము పూడిక చేయమని కోరగా యాంజిలో సానుకూలంగా స్పందించారు. అనంతరం పాఠశాలకు అతి దగ్గరలో ఉన్న డంపింగ్ యార్డ్ కు వెళ్లి పరిసరాలను పరిశీలించి,ఖాళీ బాటిల్స్, చెత్త కాగితాలు ఏరుకుంటున్న పిల్లలను పరామర్శించి వారికి బిస్కెట్ ప్యాకెట్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.జే.ఎ. స్టీవెన్,కిరణ్ కుమారి టీచర్ తదితరులు పాల్గొన్నారు.

# 14 నుంచి 17వ వరకు పోలసానిపల్లి గురుకులంలో స్పోర్ట్స్ మీట్

**భీమడోలు,మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలల జోనల్ లేవల్ గేమ్స్,స్పోర్ట్స్ మీట్ ఈనెల 14 నుండి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పోలసానిపల్లి డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి. వెంకటరమణ తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుం దని, ఈనెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు ముగింపు ఉత్సవం ఉంటుందన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో ఏలూరు జిల్లాతోపాటు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల లోని గురుకుల పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటార న్నారు. ఈ సందర్భంగా ఆటలు పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు.

# గిరిజనులు, దళితులకు బడ్జెట్లో తీరని అన్యాయం

## – సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు ప్రవేశపెట్టిన బడ్జెట్లో దళితులకి, గిరిజనులకి అన్యాయం జరిగిందని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టుకు తమ భూములు ఇచ్చి సర్వం కోల్పోయిన గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తుందని ఆయన విమర్శించారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో ఇంతవరకు చెల్లించలేదని, పునరావాస కాలనీలను పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు.

బడ్జెట్లో ఎస్సీ సబ్ ప్లాన్ కి 6.28 కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్‌కి 2.56 కోట్లు మాత్రమే ప్రకటించారని, ఈ కేటాయింపులు ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన చాలా తక్కువగా అని తెలిపారు. ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం దళితులకు తీరని అన్యాయం చేసిందని ప్రచారం చేసిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో దళితులకి అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు.

ఈ బడ్జెట్‌లో నైనా కూటమి ప్రభుత్వం పునరావాసానికి నిధుల కేటాయిస్తుందని ఎదురుచూసిన పోలవరం నిర్వాసితు లకు నిరాశే మిగిలిందని తెలిపారు. తెలుగుదేశ కూటమి ప్రభుత్వం నేడు దళితులు గిరిజనులకు తగిన విధంగా నిధులు కేటాయించకుండా తీవ్రంగా అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు.

# సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసిన కూటమి ప్రభుత్వం

**- ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి**



**ఢిల్లీ/ ఏలూరు,సూర్య బ్యూరో:** కూటమి ప్రభుత్వం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్లతో పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టడం ద్వారా సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం పతనం అంచుల్లోకి నెట్టిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి పునరుజ్జీవం పోయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల స్వర్ణాంధ్ర కల సాకారం చేయడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్సీపీ సర్కార్ అరాచకాల వల్లే రాష్ట్ర ఆర్థిక రథం అగాథంలో కూరుకుపోయిందని, మళ్లీ గాడిన పెట్టే దిశగా తమ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ఉన్నత విద్య, ఆరోగ్య రంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి నిధులు కేటాయించడం అభివృద్ధికి దోహదం చేస్తుందని అభిప్రాయ వ్యక్తం చేశారు. బీసీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, కీలకమైన పాఠశాల విద్యాశాఖకు తగిన ప్రాధాన్యం కల్పించడాన్ని స్వాగతించారు. ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించిన ప్రజల రుణం తమ ప్రభుత్వం తీర్చుకుంటుందని ఎంపీ పొట్ట మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

# సమాచార హక్కుచట్టం సావనీర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ఏలూరు, మేజర్ న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో రైతు గ్రూపులకు, రైతులకు సమాచార హక్కుచట్టం అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కుచట్టం-2005 అవగాహన కార్యక్రమాలకు సంబంధించి ఫొటోలు, ప్రచురణలతో రూపొందించిన సావనీర్‌ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం-2005 కమీషనరు వారి ఆదేశాలు మేరకు జిల్లాలో మండలస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సంబంధిత డాక్యుమెంటేషన్ కమీషనరు వారి కార్యాలయానికి సమర్పించడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో రైతులకు ప్రభుత్వ శాఖల నుంచి అవసరమగు సమాచారం పొందడం గురించి, గడువులోగా సమాచారం రానియెడల అప్పీలు చేసుకొనే విధానం గురించి వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ



**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ నాగరాణి**

**భీమవరం,మేజర్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే వినతులకు పరిష్కారం చూపడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, రీ ఓపెన్ కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరము నందు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించి, అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

**- వివిధ సమస్యలపై పీజీఆర్ఎస్ కు 164 వినతులు**

-సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 164 వినతులు అందాయి. వాటిలో కొన్ని ఫిర్యాదులు ఈ విధంగా ఉన్నవి.తాను దీర్ఘకాలికంగా బోదకాలు వ్యాధితో బాధపడుచున్నానని, ఏటువంటి ఆ దాయం లేదని, ప్రభుత్వం అందించే 35 కేజీల రైస్ కార్డు మంజూరు చేయాలని తణుకు మండలం వేల్పూరు గ్రామం చెందిన గోడితి సూర్యకుమారి ఫిర్యాదులో కోరారు. వీరవాసరం మండలం నౌదూరు గ్రామం సెంటరు చుట్టుపక్కల గ్రామపంచాయతీలకు ముఖ్య కూడాలికిగా ఉన్నది. ఈ గ్రామంలో ఆర్ అండ్ బి రహదారి ఇరువైపులా ప్రభుత్వ స్థలం ఆక్రమణలు చేసి షాపులు నిర్వహిస్తున్నారు. రహదారి వెంబడి వెళ్లే వాహనములకు అంతరాయం కలుగుతుంది తరచూ ప్రమాదాలు జరుగుచున్నవి. వ్యాపారస్తులు వ్యర్థాలను పక్కనే ఉన్న మురుగకాలములో పడవేయటం వలన నీరు కలుషితమై దుర్గంతం వెదజల్లుతుంది, అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఆక్రమణ తొలగించాలని నౌదూరు గ్రామం చెందిన గుబ్బల సత్యనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు.

గ్రామానికి చెందిన పశువుల చెరువు గట్టును ఆక్రమించుకుని సెప్టిక్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని భీమవరం మండలం కొమరాడ గ్రామం నుండి ఆర్.శక్తిశ్వరరావు ఫిర్యాదు చేశారు. గణపవరం గ్రామంలో ఎక్కడ చూసిన ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉన్నదని, ప్రభుత్వ అధికారులు స్పందించి గణపవరం గ్రామంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం చేయాలని గణపవరం ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ పి.గోవింద్ ఫిర్యాదులో కోరారు. తన పేరును ఉన్న గృహమును తన మరిది కుమారుడు దౌర్జన్యంగా అతని పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, అతని వలన నాకు ప్రాణహాని ఉన్నదని, నాకు న్యాయం చేసి అతని నుండి రక్షణ కల్పించాలని ఉండి మండలం కలిసిపూడి గ్రామము నుండి 68 సంవత్సరాల కాకరాల హేమలత ఫిర్యాదులో కోరారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డా.కెసిహెచ్ అప్పారావు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గా ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన మద్యం పాలసీని రద్దు చేయాలి

**- వంట నూనెల ధరలు అరికట్టాలి**




**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం పార్టీ చేపట్టిన ప్రజా పోరు యాత్ర లో భాగంగా సోమవారం ఏలూరు వన్ టౌన్ లో గల పడమర వీధి, వంగాయ గూడెం, ఆముదాల అప్పలస్వామి కాలనీ, అరుంధతి పేట, దక్షిణపు వీధి తదితర ప్రాంతాల్లో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకురాలు ఏ శ్యామల రాణి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ వల్ల మహిళలు చిన్నారులపై అత్యాచారా లు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలో మూడు సంవత్సరాల చిన్నారిపై ఒక కామాంధుడు మద్యం మత్తులో అత్యాచారం జరిపి హత్య చేసిన ఘటనే దీనికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మద్యాన్ని నియంత్రిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి విరుద్ధంగా ఊరూరా బెల్ట్ షాపులు తెరుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పడమర వీధి శాఖ కార్యదర్శి వైఎస్ కనకారావు, నగర నాయకులు పిఆదిశేషు ,కేలెనిన్,ఎస్ సత్య నారాయణ, జి.శారద, వివిఎన్ ప్రసాద్,దుర్యోధన, అన్నవరం, శ్రీనివాసు, చల్ల పైడయ్య,సత్తిరాజు,కోటేశ్వరరావు, జె గోపి, మీసాల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# 9 మద్యం సీసాలను స్వాధీనం : కేసు నమోదు



**భీమవరం,మేజర్ న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా మధ్య నిషేధ,ఆబ్కారీ అధికారి ఆర్ .ఎస్.కుమరేశ్వరణ్ ఆదేశాలు మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్ నెంటెంట్ ఆర్.వి. ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భీమవరం ఇఎస్‌టిఎఫ్ వారు ఉండి మండలం తాలమ్మ చెరువు గ్రామంలో జరిపిన దాడులలో గొల్ల ఆశీర్వాదం అనే బెల్ట్ షాపు నిర్వాహ కుడిని అరెస్టు చేశారు. అతని వద్దనుండి సుంకం చెల్లించని 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడం జరిగినది. సదరు వ్యక్తిపై ఆకివీడు ఎక్సైజ్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగినది కేసు దర్యాప్తులో ఉంది. ఈ దాడులలో ఎస్ఐ ఎల్.రమాదేవి, సిబ్బంది శ్రీనివాసరావు, సురేష్ రాజు,వై.సీ.శ్రీనివాసరావు, శ్రీకాంత్, సందీప్, గణేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ "ఇన్క్లూజివ్ అండ్ క్వాలిటీ ఎడ్యుకేషన్" ఈ సంవత్సరపు థీమ్‌గా అందరికీ విద్య అందాలనే వారి సంకల్పం నేడు వాస్తవ రూపం దాల్చిందని అన్నారు. స్వాతంత్రోద్యమంలో వారి భాగస్వామ్యం కేంద్ర విద్యాశాఖ మంత్రిగా వారు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రాంబాబు ఐక్యుఏసి కోఆర్డినేటర్ ఎం కృష్ణచైతన్య, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు టివి దుర్గాప్రసాద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు వి వెంకటరావు, ఎస్ పరమేశ, డాక్టర్ ఎం విజయ్ కుమార్ ,డాక్టర్ పి ఆర్ కావ్య శ్రీ,ఎస్ సుస్యలత ,డి సుజాత పాల్గొన్నారు.